నిషేధమున్నా.. తగ్గేదేలే

ప్రభుత్వం జూన్ 1వ తేదీ నుంచి ఇసుక రీచ్‌లను మూసివేయాలని, ఇసుకను తరలించరాదని, ఏర్పాటు చేసిన డిపోల వద్ద మాత్రమే ఇసుకను తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసి ఉంది. అయినా టీడీపీ నేతలు తగ్గేదేలే అంటూ ఇసుక దందాను కొనసాగిస్తున్నారు. దీనిపై స్థానికులు పలుమార్లు గగ్గోలు పెట్టినా కొన్ని రీచ్‌ల వద్ద తమ్ముళ్ల హవా కొనసాగుతూ యథేచ్ఛగా ఇసుక దోపిడీ చేసుకుంటున్నారు

- పదులకొద్దీ ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపు
- దండుకుంటున్న తెలుగు తమ్ముళ్లు


ఆత్మకూరు మండలం అప్పారావుపాళెం రీచ్ నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

ఆత్మకూరు: మండలంలోని అప్పారావుపాళెం ఇసుక రీచ్‌లో ప్రభుత్వ ఆదేశాలను కొందరు బేఖాతరు చేస్తున్నారు. అప్పారావుపాళెం పెన్నానది ఇసుక రీచ్ వద్ద ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. ఉదయం 6 గంటలకే పదులకొద్ది ట్రాక్టర్లు అటు చేజర్ల, ఇటు ఆత్మకూరు మండలాల నుంచి రీచ్ వద్దకు చేరుకుని ఇసుకను నింపుకొని దర్జాగా వెళ్తున్నాయి. మరి ఇక్కడ ఇసుక రీచ్‌ను మూసివేయాలన్న ప్రభుత్వ పాలసీ ఏమైందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అనుమతిలేని దండకాలు

గతంలో ఇక్కడి ఇసుక రీచ్‌లో ఎస్సీ, ఎస్టీ కాలనీకి చెందిన వారే ట్రాక్టర్లకు లోడ్ చేయడం రివాజు. అది వారి కుటుంబ పోషణకు ప్రధాన వనరుగా ఉంది. ఈ కాలనీల్లో సుమారు 30 బ్యాచ్‌లు (బ్యాచ్‌కు 8 నుంచి 10 మంది) ఇలా ఇసుకను ట్రాక్టర్లకు లోడ్ చేస్తుంటారు. ప్రస్తుతం ఎలాంటి అనుమతులు లేకున్నా స్థానిక టీడీపీ నాయకుడి ప్రమేయంతో కాలనీకి చెందిన ప్రమోద్ అనే యువకుడు, అతని కుటుంబ సభ్యులు రీచ్‌లోకి వెళ్లే ట్రాక్టర్లకు ఇసుకను లోడ్ చేసేందుకు కాలనీలోని బ్యాచ్‌ల వారికి చీటీలు ఇచ్చి రోజుకు ఒక బ్యాచ్ వద్ద రూ.50 చొప్పున వసూలు చేస్తున్నాడు. ఇదేమి దండకాలు అని ప్రశ్నిస్తే ట్రాక్టర్లను వరుస పద్ధతుల్లో పంపడం, వివాదం లేకుండా ఇసుకను లోడ్ చేసి అందరికి పని కల్పించేలా చేసేందుకు ఇలా చేస్తున్నట్లు వారు చెప్పుకుంటున్నారు. అయితే ఇందులోనూ ఆ దండకాలు చేసే కుటుంబీకులు ఒక్కోరికి ఒక్కోరకంగా చీటీలు ఇస్తున్నారు. వారికి కావాల్సిన వారికి ఎక్కువ బండ్లు లోడ్ చేసుకొనేలా చీటీల ద్వారా అనుమతిస్తున్నారని స్థానికులు వాపోయారు. ఈవిషయమై రెండు నెలల క్రితం పోలీసులకు, ఆత్మకూరు ఆర్డీఓకు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు.

అనుమతి లేదు

అప్పారావుపాళెం రీచ్‌లో ఇసుకను తరలించేందుకు అనుమతి లేదు. ఇలా వసూలు చేయడం నేరం. ఈ విషయమై తహసీల్దారు, స్థానిక వీఆర్వోలతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం. దీనిపై తహసీల్దార్‌ను పిలిచి నివేదిక ఇవ్వాలని ఆదేశించాం.

– బి.పావని, ఆర్డీఓ, ఆత్మకూరు

రోజుకు వేలల్లో...

ఇలా ఇసుక లోడ్ పేరుతో బ్యాచ్‌ల వద్ద వసూలు చేస్తున్న నగదు రోజుకు సుమారు రూ.2 వేలకు పైగా ఉంటుందని, ఇది వారికా, తెలుగుదేశం నాయకులకు అందజేస్తున్నారా.. అనే అనుమానాలు పలువురు వ్యక్తం చేస్తున్నారు. రోజూ వందలాది వాహనాల తాకిడితో ఇసుక రీచ్ వద్ద నుంచి గ్రామంలోకి వచ్చే రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదకరంగా తయారైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి అక్రమ దండకాలను నిలపాలని, ప్రభుత్వ పాలసీ మేరకు ఇసుక రీచ్‌ను నిలిపివేయకుండా కొనసాగించడంపై విచారణ జరపాలని గ్రామస్తులు కోరుతున్నారు.


రీచ్ నుంచి గ్రామంలోకి గుంతల రోడ్డుపై వస్తున్న ఇసుక ట్రాక్టర్లు


రీచ్ నుంచి చేజర్ల మండలానికి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ



ఉదయగిరి రూరల్: మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామంలో కొలువైన అనంతపూరి గంగా భవాని అమ్మవారి తిరునాళ్లలో భాగంగా రెండో రోజు సోమవారం మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పసుపు, కుంకుమ, కాయ కర్పూర నైవేద్యాలను తీసుకొని మహిళలంతా ఆలయానికి చేరుకున్నారు. కుంకుమ పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక వాహనంలో కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

వైఎస్సార్ విగ్రహ ధ్వంసం పిరికిపంద చర్య

దుత్తలూరు: మండలంలోని వెంకటంపేటలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం పిరికిపంద చర్య అని జెడ్పీటీసీ సభ్యురాలు లెక్కల లక్ష్మీకాంతమ్మ సోమవారం అన్నారు. మద్యం మత్తులో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఇలాంటి అనాగరిక చర్యలు భవిష్యత్తులో జరగకుండా నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



సంగం : మండలంలోని గాంధీజనసంఘం ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి, దక్షిణకొరియాలో శాస్త్రవేత్తగా ఉన్న గ్రామానికి చెందిన కె.నవీన్‌కుమార్ నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. ఈ మేరకు టి.విమలకు రూ.5 వేలు, నందిని, నరేంద్రలకు రూ.3 వేలు వంతున సోమవారం పాఠశాలలో పంపిణీ చేశారు.

ఆటపాటలతో విద్యాబోధన


పుస్తకాలను పంపిణీ చేస్తున్న సీడీపీఓ సునీత

ఉదయగిరి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేయాలని సీడీపీఓ సునీత సూచించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఉదయగిరి, సీతారామపురం మండలాలకు సంబంధించిన అంగన్‌వాడీ కేంద్రాలకు పీ–1, పీ–2 పుస్తకాలను ఆమె సోమవారం పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచాలన్నారు. సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు తేజస్విని, షానూ, తదితరులు పాల్గొన్నారు.

21న సామూహిక యోగా

ఉదయగిరి రూరల్: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఈనెల 21న నిర్వహించే సామూహిక యోగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని, విజయవంతం చేయాలని తహసీల్దార్ రామ్మోహన్, ఎంపీడీఓ అప్పాజీ కోరారు. వారు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న విశాఖపట్నంలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. సచివాలయాల పరిధిలో జరిగే యోగా కార్యక్రమానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతిఒక్కరూ హాజరు కావాలన్నారు.

ఈ–కేవైసీ నమోదు తప్పనిసరి

అనుమసముద్రంపేట: అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతులు ఈ–కేవైసీ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌టీజీఎస్ వాలిడేషన్ అనంతరం ఆధార్ నంబర్ల ప్రకారం మండలంలో అర్హత గల 4,586 మంది రైతుల రికార్డులు మాత్రమే ఈ–కేవైసీకి వచ్చినట్లు తెలియజేశారు. ఏమైనా సందేహాలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు.

సన్మానం



ఆత్మకూరురూరల్: మండలంలోని బసవరాజుపాళెం ప్రాథమిక పాఠశాలలో గత ఎనిమిదేళ్లుగా పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు జూగుంట కొండయ్యను సోమవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చల్లా మల్లికార్జున, శానంపూడి కిరణ్, జూగుంట చిన కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణ



ఆత్మకూరురూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పద్మజాకుమారి పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఉదయగిరి రూరల్: మండలంలోని కృష్ణంపల్లె బీసీ కాలనీకి చెందిన తుపాకుల వెంకటసుబ్బయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో మన ఫౌండేషన్ అధినేత మన్నటి వెంకటరెడ్డి సోమవారం తన ప్రతినిధుల ద్వారా రూ.10 వేల నగదు సాయాన్ని బాధితుని కుటుంబ సభ్యులకు వారి నివాసంలో అందించారు.

పదోన్నతులు కల్పించాలని వినతి


సంగం: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు


మర్రిపాడులో..

సంగం: అర్హులైన గ్రామ రెవెన్యూ సహాయకులకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ సంగం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏలు సోమవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తహసీల్దార్ సోమ్లానాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అర్హత ఉన్న గ్రామ రెవెన్యూ సహాయకులను వీఆర్వోలుగా ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని కోరారు. వీఆర్‌ఏల సంఘం నాయకులు లక్షయ్య, అమీర్, రాజేష్, శైలజ, మురళి తదితరులు పాల్గొన్నారు.

- మర్రిపాడు: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ యాదవ్‌కు ఆయన కార్యాలయంలో సోమవారం వీఆర్‌ఏల సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు ఓబులేసు, నానాజి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే అర్హులైన వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూన్ 26న కలెక్టర్ కార్యాలయం వద్ద మహా ధర్నాను నిర్వహిస్తున్నామని, వీఆర్‌ఏలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి రత్నయ్య, సీపీఎం మండల కార్యదర్శి రహంతుల్లా పాల్గొన్నారు.

పలువురు అధికారుల బాధ్యతల స్వీకరణ

ఇన్‌చార్జి ఎంపీడీఓగా శ్రీనివాసరెడ్డి


శ్రీనివాసరెడ్డి

వరికుంటపాడు: వరికుంటపాడు మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా కె.శ్రీనివాసరెడ్డి సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన వింజమూరు ఎంపీడీఓగా పనిచేస్తూ వరికుంటపాడుకు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయనను సిబ్బంది శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. సీనియర్ సహాయకుడు కొల్లు వెంకటాద్రి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ నియామకం


డీటీ సందాని

సీతారామపురం: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పి.సందాని నియమితులయ్యారు. ఈయన దుత్తలూరు మండల ఆర్‌ఐగా పనిచేస్తూ డీటీగా పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే మండల ఆర్‌ఐగా సుభాని నియమితులయ్యారు. ఈయన వరికుంటపాడు మండలంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఆర్‌ఐగా పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

చేజర్ల ఏఓగా హిమబిందు


హిమబిందు

చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండల వ్యవసాయాధికారిగా(ఏఓ) పీఎస్ హిమబిందు సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడి ఏఓగా పనిచేస్తున్న వి.శశిధర్ సంగం మండలానికి బదిలీ కాగా ఆయన స్థానంలో నెల్లూరులో ఏఓగా పనిచేస్తున్న పీఎస్ హిమబిందు చేజర్లకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమెకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వపరంగా పారదర్శక సేవలు అందిస్తానన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి ఈ–కేవైసీని ఈనెల 20వ తేదీలోపు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది ఎల్.సుజాత, డీవీ సుబ్బారావు, వీఏఏలు, వీహెచ్‌ఏఎస్‌లు పాల్గొన్నారు.

ఆత్మకూరులో పాలిసెట్ కౌన్సెలింగ్

ఆత్మకూరు: ఏపీ పాలిసెట్ కౌన్సెలింగ్–2025ను ఆత్మకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ బి.నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు ఆన్‌లైన్‌లో చెల్లించిన ఫీజు రసీదు, పాలిసెట్ హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, పదో తరగతి మార్కుల మెమో, టీసీ, నాలుగు నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఆదాయ ధ్రువీకరణ తదితర సర్టిఫికెట్లను తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 79016 20305, 88018 09870 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ముందుగానే రేషన్ నిలిపివేత

ఆత్మకూరు: గత ప్రభుత్వంలో 18వ తేదీ వరకు రేషన్ సరుకుల పంపిణీ జరిగేది. అందులోనూ ఇంటి వద్దకే రేషన్ సరుకులను అందిస్తుండడంతో లబ్ధిదారులకు కష్టం లేకుండా ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. దీంతోపాటు 15వ తేదీతో రేషన్ సరుకుల పంపిణీని నిలిపివేయడం, దీని గురించి ప్రజలకు సరైన సమాచారం లేకపోవడంతో పలువురు సోమవారం రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి నిరాశతో వెనుదిరిగారు. ఈ క్రమంలో పాత పద్ధతిని రద్దు చేయడంపై ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు.

పలువురు ఏఓల బదిలీ

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు నియోజకవర్గంలోని మండలాల వారీగా వ్యవసాయ శాఖ అధికారుల బదిలీలు సోమవారం జరిగాయి. సంగం మండల ఏఓగా శశిధర్, చేజర్ల ఏఓగా హిమబిందు, అనుమసముద్రంపేట ఏఓగా సురేష్‌బాబు, అనంతసాగరం ఏఓగా శైలజకుమారి, మర్రిపాడు ఏఓగా శివరంజని నియమితులయ్యారు.

బస్టాండ్‌ను ఆధునికీకరిస్తాం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను త్వరలో ఆధునికీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్టాండ్‌లోపల సీసీరోడ్లు, ప్రయాణికులు కూర్చునేందుకు అధునాతన కుర్చీలు తదితరాలను ఏర్పాటు చేస్తామని వివరించారు.

పట్టాలు ఇప్పించాలని వినతి


ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న రైతులు, రైతు సంఘ సభ్యులు

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంతో పాటు మండలంలో పలువురు దళితులకు అసైన్‌మెంట్, డీకేటీ భూములను గతంలో ప్రభుత్వం కేటాయించిందని, వాటికి పట్టాలు మంజూరు చేయాలని పలువురు ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ పావనికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం దళితులకు కేటాయించిన భూముల్లో సాగు చేసుకుంటున్న వారిని సీజేఎఫ్‌ఎస్‌లో సభ్యులుగా చేర్చి ప్రభుత్వమే ఆ సంస్థను నిర్వహిస్తూ వచ్చిందని, 2018లో సీజేఎఫ్‌ఎస్‌ను రద్దు చేసి వ్యక్తిగత పట్టాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అందులో భాగంగా జిల్లాలో 787 సీజేఎఫ్‌ఎస్ సంస్థలను రద్దు చేసిందన్నారు. అప్పట్లో కొందరికే పట్టాలు ఇచ్చారని, ప్రస్తుతం ఆత్మకూరులో అలాంటి దళిత రైతులు వంద మందికిపైగా ఉన్నారని, వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, ఉపాధ్యక్షుడు కృష్ణప్రసాద్, పెంచలయ్య, కొండా వెంకటేశ్వర్లు, హజరత్తమ్మ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనంలో బడుగు వర్గాలకు అన్యాయం

- దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి


కావలి ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

కావలి (జలదంకి) : తల్లికి వందనం పథకంలో బడుగు వర్గాలకు అన్యాయం చేయడం తగదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి అన్నారు. కావలి ఆర్డీఓ కార్యాలయం ఎదుట దళిత నాయకులతో కలిసి సోమవారం ఆయన ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల వల్ల కొందరికి తల్లికి వందనం అందలేదన్నారు. కొందరు నాలుగు చక్రాల వాహనాలను నడుపుకొంటూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. కొంతమందికి అసలు పొలం లేకపోయినా పదెకరాల పొలం ఉన్నట్లు నమోదై ఉందన్నారు. అలాంటి వారికి పథకం అందకపోవడం దారుణమన్నారు. కొందరికి ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉన్నా ఒక్కరికే నగదు జమ చేశారని తెలిపారు. మిగిలిన వారికి కూడా నగదు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, చౌటూరి జనార్దన్, జెడ్డా వాసు, జరుగుమల్లి విజయరత్నం, కోటయ్య, గిరి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు విశేష పూజలు


ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ తల్లి


పొంగళి సామగ్రిని తీసుకొస్తున్న మహిళలు

సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని పాతదేవరాయపల్లి గ్రామంలో కొలువైన పోలేరమ్మ తల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఆది, సోమవారాల్లో ఆలయం వద్ద విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుడు సద్దా వెంగళరెడ్డి మాట్లాడుతూ సోమవారం ఉదయం ప్రత్యేక పూలతో అలంకరించి గ్రామస్తుల నడుమ విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం మహిళలు గంపలతో పొంగలి సామగ్రి ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చి పాల పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

రీసర్వే లోపాలను సరిచేయాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందించి విన్నవిస్తున్న గ్రామస్తులు

ఉదయగిరి: మండలంలోని కోటాయపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు గతంలో జరిగిన భూముల రీసర్వేలో లోపాలను సరిచేయాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ముందుగా వారు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలో గతంలో జరిగిన రీసర్వేలో అసలైన పట్టాదారు కాకుండా, సంబంధం లేని వ్యక్తుల పేర్లు, ఫొటోలు నమోదు చేశారన్నారు. అలాగే భూవిస్తీర్ణంలో కూడా తేడాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే అనేకమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. రీసర్వేలో జరిగిన లోపాల వల్ల గ్రామాల్లో వివాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోయారు. వాగు పోరంబోకు భూములను సైతం కొంతమందికి పట్టాలిచ్చినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతి పత్రం అందించారు.

ఇదేనా సమయపాలన?

- ఉదయం 11 గంటలైనా తెరుచుకోని సచివాలయం
- గ్రీవెన్స్ డే రోజే ఇంత నిర్లక్ష్యమా..?


ఆత్మకూరు హిల్ రోడ్డులో ఉన్న సచివాలయం వద్ద 11 గంటల ప్రాంతంలో వేచి ఉన్న ప్రజలు

ఆత్మకూరు: ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యేలా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ కూటమి ప్రభుత్వంలో నిర్వీర్యం అవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడి సిబ్బందికి వివిధ రకాల సర్వేల పేరుతో కార్యాలయాలకు దూరంగా ఉండేలా చేసిన విషయం తెలిసిందే. అయితే దానికి తగ్గట్టుగానే సచివాలయాల సిబ్బంది కొంతమేర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ప్రజల పడిగాపులు

ఆత్మకూరు పట్టణంలోని 15, 16, 18 వార్డులకు సంబంధించిన సచివాలయం సోమవారం ఉదయం 11 గంటల వరకు తెరుచుకోలేదు. ఈ సచివాలయం పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఉండే ప్రాంగణంలోనే ఉండడం గమనార్హం. సహజంగా సోమవారం ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్ డే) నిర్వహించడం ఆనవాయితీ. అదే క్రమంలో సచివాలయాల్లో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు అందుబాటులో ఉండేలా సోమవారం పనిచేయాల్సి ఉంటుంది. దానికి విరుద్ధంగా 11 గంటలైనా సిబ్బంది రాకపోవడంతో అనేక పనులపై సచివాలయానికి వచ్చిన ప్రజలు సిబ్బంది కోసం ఎదురుచూస్తూ పడిగాపులు కాస్తూ కనిపించారు. విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ గంధళ్ల వేణు అక్కడికి వచ్చి పరిస్థితిని చూసి సిబ్బందికి, అడ్మిన్‌కు ఫోన్ చేసినా స్పందించలేదు.